195) రామక్రియ/రాగమాలిక

ప॥ పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు। యీటువెట్టి పెద్దతనా లెంచ బనిలేదు॥

చ॥ సరవి గలకాలము జదువుచుండు నొకడు। గరిమి నీకృప నిన్ను గను నొకడు।
ధర బ్రయాసముతోడ దపముసేయు నొకడు। శరణుచొచ్చి నీకు జనవరౌ నొకడు॥

చ॥ వొక్కడు మోపుమోచు నొక్కడు గొలువుసేయు। వొకడు పొగడీ త్యాగ మూరకే యందు।
వొక్క డాచారము సేయు నొక్కడు మోక్షము గను। యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును॥

చ॥ భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము। యేవలనైనా నీవు యిచ్చితే గద్దు।
జీవులు నిన్నెఱుగక చీకటి దవ్వగనేల। శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు॥